
# సౌందర్యపోషణ--పూర్వుల పద్ధతులు



పూర్వులు సౌందర్యంకోసం యత్నము చేసేవారిని నాగరికులు అనీ రసికులు అనీ అనేవారు. ఆలంకారికులు వీరికిచ్చిన బిరుదం సుభగులని. సౌభాగ్యం పేరేకదా సౌందర్యం! మనలో సౌభాగ్యవతికివున్న గౌరవమూ పూజ్యతా మరొకరికి ఉందా? మన పూర్వుల అందపు ఆశ హద్దులేనిది సుమండీ! చూడండి, నవవైధవ్యంతో నలిగిపోతూవున్న రతీదేవి మన్మథుణ్ణిగురించి అంతదుఃఖంలోనూ—

"అబ్బబ్బ! దేవతలు ఎంతక్రూరులండి. నాకు అలంకారం చేయడం పూర్తయినా కాలేదు. యింతలోనే మిమ్మల్ని పిల్చారు. చూడండీ: యీఎడమకాలు పారాణి లేకుండా అల్లాగే ఉంది త్వరగారండి. దీనికి పారాణిపెడుదురుగాని"

అంటుంది. ఇది అందానికి మనవారిచ్చిన స్థానం హద్దులేనిదని చెప్పడం లేదండీ?

### సొమ్ములు

మొగవాళ్లకంటే కూడా స్త్రీలకే అందం అంటే అత్యాశ అంటారు. మన వాఙ్మయంచూస్తే యీమాట నిజంగా తోచదు. అందంకోసం ధరించే సొమ్ముల్లో యిద్దరికిన్నీ యే కిరీటం ముక్కురా లాంటి దగ్గరో కొద్ది తేడా ఉండొచ్చు. అంతే. తక్కినహారాలూ, పదకాలూ, వడ్డాణం, కాళ్లా చేతులా కడియాలూ, యిత్యాదులన్నీ సమానమే. ఇంతెందుకు? యీశ్లోకం మెరిగించేకదండి:-

కస్తూరీతిలకం లలాటఫలకే వక్షస్థలే కౌస్తుభం॥ నాసాగ్రే నవమౌక్తికం కరతలే వేణుంకరే కంకణం॥ సర్వాంగే హరిచందనంచ కలయం కంఠేచ ముక్తావళీం॥గోపస్త్రీపరివేష్టితో విజయతే గోపాలచూడామణిః

కాబట్టే అందం దిద్దుకోడంలో స్త్రీ పురుష భేదం లేదన్నాను. సత్యోద్రేకం వున్నవాళ్లందరికీ అందపు ఆశ వుండాలిసిందే. అయినా స్త్రీలు సుకుమార ప్రకృతులు కావడం మూలాన అందపు ఆశా, యత్నమూ, ఓపికా, తీరికా, కొంత హెచ్చుగా వారికి ఉందన్నాకూడా న్యాయమే అనిపిస్తుంది. పూర్వకాలంలో సర్వసాధారణమైన అలంకారం యెలావుండేదో మనం గమనింతాం.

శ్లో॥ హస్తే లీలాకమలం అలకే బాలకుందానువిద్ధం
నీతా లోధ్రప్రసవరజసా పాండుతామాననేశ్రీః
చూడాంగే నవకురవకం చారు కర్ణే శిరీషం
సీమంతేచ త్వదుపగమజం యత్రనీపం వధూనాం.

చేతిలో వయ్యారంగా ఒక కమలం, పాపిడికి రెండు ప్రక్కలా మల్లెల జాలర్లూ, మొగాన లొద్దుగ పుప్పొడిశోభా, కొప్పులో కొత్తగోరింటలు, చెవినందున దిరిసెనపూవు, పాపిటిలో కడిమి మొగ్గా— యివి అలకానగర స్త్రీల అలంకార సామగ్రిలట.

### స్నానాలు

నిజానికి అందం చేసుకొనేపద్ధతి యిదే అయినా యేకాలంలోనూ నిరాడంబరంగా అలంకరించుకొనే వారు కొందరు ఉంటూవుంటారు.

స్వచ్ఛాంభః స్నపనవిధౌత మంగం
ఓష్ఠస్తాంబూలద్యుతివిశదో విలాసినీనాం,
వాసస్తు ప్రతనువివిక్తం అస్త్వితీయాన్
ఆకల్పో యది కుసుమేసుణా నశూన్యః.

పరిశుభ్రంగావుండే నీళ్లతో ఆప్యాయనంగా స్నానం, తాంబూలపు ఎరుపుతో తళతళలాడే పెదవి, సన్నని తెల్లని, స్వచ్ఛమైన రవసెల్లా అనేయీపాటి అలంకార సామగ్రి ఉంటేచాలు మన్మథసుఖానుభవం పూర్ణంగా పొందవచ్చు అనిభావం.

హాయీ, స్థాయీ లేకుంటే ఎవరూ దేన్నీ సాధింపలేరు. అందందిద్దుకోవడములో కూడా యింతే. అందంచేసుకోవడంకానీ, అనుభవించడంకాని, ఇల్లూ వళ్లూమీద ఆధారపడుతుంది. వాత్స్యాయనుడు నాటి నాగరికుని యిల్లు యిల్లా వర్ణించాడు.

### గృహాలంకరణం

"చక్కని నీటి వసరుగలచోట ఉద్యానంతో సహా యిల్లు- ముందూ వెనకా రెండుభాగాలుగా ఉండాలి. ముందు యింట్లో తెల్లని స్వచ్ఛమైన పరుపులుపరచిన సోఫాలూ, బల్లలూ, దేవతా ప్రార్థనకై కూర్చానసం,

**శ్రీ పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారి రేడియో ప్రసంగమునుండి**

దానికెదురుంగా ఒక అరుగూ, అరుగుపైన చందనపు పాత్రలూ, పుష్పమాలికలు, సౌగంధికపు పుటిక, లవంగపు పట్టా, తాంబూలాలున్నూ, చిలక్కొయ్యకు వీణా, చిత్తరువు పలకా, రంగుల భరిణ, కుంచ, యేదో ఒకమంచి పుస్తకం, గోరంట మాలికలు, చదరంగపు బల్ల, జూదపుపాచికలు, పెంపుడుపిట్టల పంజరాలూ వుండాలి. వెనకయింట్లో తూగుటుయ్యాలలూ మొదలైనవి ఉండాలి.

ఇల్లు యిలాగ్గా రమ్యంగా దిద్దుకొన్న పిమ్మట నాగరకునికి అతడు పెద్ద కార్యక్రమం యిస్తాడు. ప్రతిరోజూ ఉదయం కాలకృత్యాలు తీర్చికొద్దిగా చందనం పూసుకోవాలి. జుత్తుకు అగరుధూపం, పెదవులకు అలక్తం-రంగు, ముఖవాస తాంబూలాదులు సేవించిన పిమ్మటే తక్కినపనులు చేయాలి.

హాయీ, స్థాయీ ఆనాడు యెంతప్రధానాలో నిష్ఠా, తిష్ఠా కూడా అంత ప్రధానాలు. వాత్స్యాయనుడు నాటినాగరకుని కార్యక్రమంలో నిత్యం అభ్యంజనస్నానాన్ని రెండేసిరోజులకోమారు నలుగూ, మూడేసిదినాలకు వకమారు శరీరానికి నునుపూ నిగనిగా యిచ్చే ఫేనకం, నాలేసిరోజులకోమాటు అయుష్కర్మా, పదేసి దినాలకు ప్రత్యాయుష్యాన్నీ విధిగా చేర్చాడు.

పూర్వం యీ అలంకారంమీద యింతమోజు వుండడంచేతే ఆకాలంలో కొందరు అలంకరించడం వృత్తిగా యేర్పరచుకన్నారని తెలుస్తుంది. ఈవృత్తిని స్త్రీలే చేసేవారు. వీరిని ప్రసాధికలు, శిల్పకారికలు, సైరంధ్రులు అని ఆనాడు అనేవారు.

మనపూర్వులు అలంకారం చేసుకొనేరీతులు అనేక విధాలుగ నాడు వుండేవి. ఏ అలంకారానికైనా ముందుగా ఆభాగాన్ని గంధతైలంరాసి, లోధ్రకల్కంతోనలిచి, తేలిగ్గా సిక్థకం అద్ది, మెత్తదనాన్ని నిగనిగనూ ఏర్పరచుకొనేవారు. తడి ఆరేందుకు చక్కని ధూపద్రవ్యాలుకూడా ముందే సిద్ధంచేసుకొనేవారు.

ప్రాచీనుల అలంకారాలలో హెచ్చు వ్యాప్తిగలది పత్రరచన. ఇది చాల ముఖ్యమైనది కూడ. మకరికాదులని వీటికే మరోపేరు. సిందూరం, కుంకుమపువ్వు, అభ్రకం, చాయపసుపు, అర్ధళం యిత్యాదులను నిర్దుష్టంగా చూర్ణించి, వీటిని ద్రవపదార్థాలతో కలిపి ముఖ్యంగా స్త్రీలు చెక్కిళ్లు చేతులు చెవిసందులు సందిళ్ళు మొదలైన ప్రదేశాలలో వింత ఆకారాల తీగలూ పువ్వులూ యేర్పడే రీతిగా చిత్రించుకొని వాటిని విరిసిపోనీ, మాసిపోనీ ధూపాలతో తడి ఆర్చేవారు.

### చందనచర్చ

ఇల్లాగే కస్తూరి పసుపు కలిసిన చందనం స్తనాలకు పూసి చనుమొనలకు అగరు రాసుకొనేవారు. ఇది నాటి వారికి చాలా సరదా. చారిత్రకంగా చూస్తే మన అలంకార రచనలో పత్రరచనే ఆద్యసృష్టిగా తోస్తుంది. పచ్చబొట్లు, రకరకాల బంగారురత్నాల సొమ్ములూ, యివన్నీ సౌలభ్యంకోసరం శాశ్వతత్వం కొరకు ఏర్పడ్డమార్పులుగా వుండొచ్చు. పత్రరచన తరువాత పారాణి చాలా ప్రాముఖ్యం గడించింది.

కాని యీ మధ్యను చిన్న చిన్న అలంకార రచనలు చాలాచాలా వున్నవి. అందు కొన్ని :—

నల్లని నిగనిగలాడే కాలాంజనంతో కనుబొమ్మలు సోగలు తేలేట్టు దిద్దుకోడం ఒకటి. ఇది భ్రూవిలాసాభిజ్ఞతను తెల్పేదిగా వుంది. పండ్లకు, పెదవులకు రంగులు వేసుకోవడం, కాళ్ళా, వేళ్ళా గోళ్లకు గోరంట పెట్టుకోవడం, పళ్ళకు నిగనిగవచ్చేట్టు, వరిగింజతో పళ్ళుతోమడం, పసుపునీళ్లతో జలకం, తెల్లావాలు చూర్ణించి ఫేస్ పౌడరుగా వుపయోగించడం రెండోది. ఇది దశనవసనాంగరాగమనే లలితకళకు నిదర్శనం. చిత్రవిచిత్రరీతుల మొగమున బొట్టు దిద్దుకోవడం మూడోది. యిదే విశేషచ్ఛేద్యమనే కళ. కళ్ళకు శలాకాంజనంతో కాటుక పెట్టుకోవడం, పెదవులకు తడి ఆరని సిద్ధకంతో పవడపుజిగి వచ్చేట్టు అద్దుకోవడం నాల్గోపని. యింకా కర్ణపత్రరచనలూ, పాము కుబుసంలాంటి సోగ జడలు అల్లుకోవడం చిత్రవిచిత్రాకృతుల పూవు సెత్తులు ధరించడం స్తనాలు, నూగారువళులు కస్తూరితో దిద్దడం, హారాదులు అనేక తరహాలవి ధరించడం, యిత్యాదులు అనేకం వున్నవి.

ఏదయినా కారణాంతరాలవల్ల సౌందర్యం చెడిపోతే, దాన్ని మళ్ళా నిలువుకొనేందుకు చాలా చాలా యత్నాలు ఆనాటివారు చేసేవారు. ఎవరయినా ద్రోహబుద్ధితో యితరుల అంగాన్ని చెడగొట్టినా, లేక, చెడగొట్టే ప్రయత్నం చేసినా ఆనాడు న్యాయస్థానంలో అదిరుజువైతే అట్టివారికి ఉత్తమసాహసదండం శిక్షగా విధించవలెనన్నారు అర్థశాస్త్రజ్ఞులు.

సౌందర్యరక్షణ

చూడండి నాటివారి సౌందర్యరక్షణ దీక్షయెంతదో! సౌందర్యాన్ని పునస్థాపించుకొనే యత్నాన్నే మనవారు భగంకరణం అనేవారు. యీక్రింది విషయాలు అందులోనుండి చెపుతున్నాను. తగరకం, (గ్రంథితగరం) చెంగల్వకోష్ఠు, తాడిశపత్రి చూర్ణించి, దాంతో అనులేపనం చేసికోవడమున్నూ, లేదా ఆచూర్ణంతో వైత్తులు చేసి వెలిగించి ఆ మసిని కాటుక చేసి పెట్టుకోవడమున్నూ, మనర్నవాసవా, దేవఆకు, శారిబ, గోరింట, కలువపూలు, ఆకులు వేసి కాచినతైలంతో అభ్యంజనం చేసికోవడమున్నూ, లేక వీటిపూవులతో మాలికలుచేసి ధరించడమూ యిత్యాదులన్నీ కనీసపు అందాన్ని నిలుపుకోవడంలో ఆనాటివారు ఉపయోగించేవారు. వైద్యశాస్త్రంకూడా ఈవిషయాలను యెంతో విస్తరించి చెపుతుంది.

శుక్రవృష్టి, ధాతుబలం పెంపొందించుకోడంకూడా సౌందర్యం కాపాడుకొనే సాధనాల్లోనే చేరుతుంది. కనుకనే పద్మోత్పల నాగకేసరాదులను ఎండించి, చూర్ణంచేసి, నెయ్యీ తేనేచేర్చి లేహ్యముగాచేసి తిన్నాకూడా చెడిపోయిన అందం మరల కుదుటబడేదని అంటారు.

ఎన్ని చెప్పేదండీ! ఆనాడు మనవారు సహజమైనా యీశ్వరదత్తమయినా యీ అందాన్ని పెంపొందింపచేసికోడానికిగానీ, లేదా ఆఅందం కారణాంతరాల వల్ల చెడితే మరల దాన్ని చక్కచేసికోవడానిగ్గానీ యెంతెంతో శ్రమ చేసేవారు. ఒక పరిశ్రమ చెయ్యడమే కాదు. సౌందర్యాన్ని నిలుపుకొన్నారుకూడ.